క్లుప్తంగా

శేష వాహనంపై నిర్మమహేశ్వరుడు



పొదిలి రూరల్: పొదిలి పార్వతీ సమేత నిర్మమ హేశ్వర దేవస్థానంలో కొలువైన నిర్మమహేశ్వరుడు ఆదివారం రాత్రి 8 గంటలకు అర్ధనారీశ్వర రూపంలో ప్రత్యేకంగా అలంకరించి శేష వాహనంపై పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. పెదసంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ, ఎస్వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్న కేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

మెడికల్ కాలేజీ త్వరగా పూర్తి చేయాలి

పొదిలి: మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం గత ప్రభుత్వంలో 70 శాతం పూర్తయిందని, మిగిలిన 30 శాతం పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, పీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించాలన్నారు. మార్కాపురం కేంద్రంగా హామీ ఇచ్చిన జిల్లాను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. వెలిగొండ నిర్వాసిత రైతులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.900 కోట్లు చెల్లించాలన్నారు. మెడికల్ కళాశాలను పీ4 పద్ధతిలో పూర్తి చేస్తామంటే పేదలకు వైద్య సేవలు అందని ద్రాక్షలా మిగులుతాయని విమర్శించారు. జిల్లాలో లక్ష కుటుంబాలకు ఆర్థిక బాసటగా నిలిచే పాల కేంద్రాన్ని తెరిపించాలని సైదా కోరారు.

చికెన్ విక్రయాలు దయనీయం
బర్డ్‌ఫ్లూ భయం..

- కస్టమర్లు రాక వెలవెలబోతున్న చికెన్ షాపులు
- కేజీ రూ.100 అన్నా ముందుకు రాని మాంసప్రియులు
- మటన్, చేపల కొనుగోలుకు ఆసక్తి
- ధైర్యంగా చికెన్ తినవచ్చని చెబుతున్న వైద్యాధికారులు
- సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లతో వ్యాపారం దెబ్బతింటోందని దుకాణదారుల ఆవేదన

బేస్తవారిపేట/కంభం:

బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై సోషల్ మీడియాలో పుంఖానుపుంఖాలుగా వస్తున్న వార్తలతో మాంసప్రియులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా కోడి మాంసం తినడం మానేశారు. అయితే జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, నిరభ్యంతరంగా చికెన్ తినవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా ప్రజలు మాత్రం భయాందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో చికెన్ విక్రయాలు భారీగా పడిపోవడం బర్డ్ ఫ్లూపై ప్రజలకు ఉన్న భయాన్ని స్పష్టం చేస్తోంది. రోజూ కిటకిటలాడే చికెన్ షాపులు గత కొద్ది రోజులుగా కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. వ్యాపారం భారీగా పడిపోవడంతో దుకాణాల నిర్వాహకులు దిగులు చెందుతున్నారు.

నియోజకవర్గంలో సుమారు 150కి పైగా చికెన్ షాపులు ఉన్నాయి. ప్రతి దుకాణంలో ఆదివారం 500 కేజీల నుంచి 800 కేజీల వరకు కోడి మాంసాన్ని విక్రయిస్తుంటారు. వీటితో పాటు ఫంక్షన్లు, ప్రత్యేక రోజుల్లో చికెన్ వినియోగం రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. సాధారణ రోజుల్లో సైతం 150 నుంచి 300 కేజీల వరకు మాంసం విక్రయాలు సాగుతాయని అంచనా. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వార్తల ప్రభావం చికెన్ దుకాణాలపై తీవ్రంగానే పడింది. ప్రస్తుతం చికెన్ తినడానికి ప్రజలు వెనకడుగు వేస్తుండటంతో వ్యాపారం లేక నష్టపోవాల్సి వస్తోందని దుకాణదారులు ఆవేదన చెందుతున్నారు. హోల్‌సెల్ దుకాణాల వారు చికెన్ కేజీ వంద రూపాయలకు అంతకన్నా తక్కువకు ఇస్తామంటున్నా కొనడానికి మాంసప్రియులు ముందుకు రావడం లేదు.



కంభం : రావిపాడు రోడ్డు సమీపంలో ఖాళీగా ఉన్న చికెన్ షాపు

అసలేంటి ఈ బర్డ్ ఫ్లూ..

బర్డ్ ఫ్లూ అనేది హెచ్5ఎన్1 రకం వైరస్ ద్వారా కోళ్లకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకినప్పుడు కోళ్లు అకస్మాత్తుగా మరణిస్తాయి. బర్డ్‌ఫ్లూ వ్యాధి కోళ్ల నుంచి మనుషులకు సోకడం అరుదుగా జరుగుతుంది. వైరస్ సోకినప్పటికీ మనుషులపై తక్కువ ప్రభావం చూపిస్తుందని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు.

బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్లకు సోకితే పరిసర ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్ని కోళ్లను చంపేసి పాతిపెట్టేయడం ద్వారా వైరస్ వ్యాప్తిని కట్టడి చేస్తామని చెబుతున్నారు.

బర్డ్ ఫ్లూ అక్కడే..

కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిందన్న వార్తలు ప్రబలడంతో ప్రజలు భయపడి గత కొన్ని రోజులుగా చికెన్, గుడ్లు తినడం దాదాపు మానేశారు. గోదావరి జిల్లాలో కొన్ని చోట్ల మాత్రమే వైరస్ వ్యాప్తి చెందగా ప్రస్తుతం అక్కడ కూడా పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు సమాచారం. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో గోదావరి నుంచి జిల్లాలోకి కోళ్ల దిగుమతి కాకుండా పశు సంవర్ధక శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వాస్తవానికి గిద్దలూరు నియోజకవర్గానికి కోళ్లు గోదావరి నుంచి దిగుమతి కావు. ఇక్కడి వచ్చే కోళ్లు మొత్తం హైదరాబాద్, చిత్తూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నవే. అయినప్పటికీ సోషల్ మీడియాలో వస్తున్న వార్తల నేపథ్యంలో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. జనంలో ఆ భయాన్ని పోగొట్టేందుకు అధికారులు నష్టనివారణ చర్యలకు ఉపక్రమించినా ఆశించిన ఫలితం రాలేదు.



గిద్దలూరులో మటన్ కోసం గుంపుగా ఎగబడుతున్న జనం



కంభం : కందులాపురం సెంటర్‌లో ఆదివారం వెలవెలబోతున్న చికెన్ షాపులు

చికెన్ ధైర్యంగా తినవచ్చు



చికెన్ తినడానికి ఎవరూ భయపడాల్సిన పనిలేదు. మన ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావం లేదు. ప్రజలు ఎక్కడో వ్యాధులొచ్చాయని ఆందోళన చెంది చికెన్, గుడ్లు తినడం మానేయాల్సిన పనిలేదు.

– డాక్టర్ శివారెడ్డి, వెటర్నరీ వైద్యుడు

వ్యాపారం పడిపోయింది



చికెన్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. గతంలో ఆదివారం వంద కోళ్ల వరకు అమ్ముడుపోయేవి. ప్రస్తుతం 20 కోళ్లు కూడా అమ్మలేకపోతున్నాం. దీంతో తీవ్రంగా నష్టం వస్తోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అద్దెలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది.

– అహ్మద్, రిటైల్ వ్యాపారి

సోషల్ మీడియాతో వ్యాపారాలు దెబ్బతిన్నాయి



మేము హైదరాబాద్, చిత్తూరు నుంచి కోళ్లను తెప్పిస్తాం. ఆ ప్రాంతంలో ఎటువంటి బర్డ్‌ఫ్లూ లేదు. సోషల్ మీడియాలో బర్డ్‌ఫ్లూ ఉందని వస్తున్న పుకార్లతో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి ఆదివారం 300–400 కేజీల చికెన్ అమ్మేవాళ్లం. ప్రస్తుతం 100 కేజీలు కూడా అమ్మలేకపోతున్నాం. ధరలు తగ్గించినా జనాలు రావడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

– నాగరమేష్, హోల్‌సెల్ చికెన్‌షాప్, కంభం

ముందుకు కదలని మురుగు



గృహాల ముందు కాలువలో నిలిచిపోయిన మురుగు



మట్టితో పూడిపోయిన డ్రైనేజీ

కంభం: మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలోని కల్కి భవన్ వీధిలో ఉన్న డ్రైనేజీలు పూడిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. గృహాల ముందు మురుగు నిలిచి దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలకు ఆవాసంగా మారింది. కొన్ని చోట్ల డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. ఇక్కడ మాత్రం డ్రైనేజీల నిర్వహణను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. కల్కి భవన్ వీధిలోని రామాలయానికి వచ్చే భక్తులు సైతం దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు సమస్య ఇంకా తీవ్రంగా ఉంటోందని, పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

గిద్దలూరు(బేస్తవారిపేట): ఇస్లాంలో చిట్టచివరి ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందని ముస్లిం మత గురువు హెచ్‌కే సజాత్ ఖాన్ అన్నారు. గిద్దలూరు పట్టణ సమీపంలో ఉన్న కొండపేటలో ఆదివారం నూతనంగా నిర్మించిన మసీదును ముస్లిం మత పెద్దలు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బెంగళూరు, కర్నూలు, తెలంగాణా రాష్ట్రాల నుంచి మత పెద్దలు పాల్గొన్నారు. ప్రతి ముస్లిం ఇస్లాం బాటలో నడవాలని, రాబోయే రంజాన్ నెలలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేయాలని సూచించారు. మసీదులో నమాజుతోపాటు మదరస నిర్వహిస్తున్నామని, చిన్నారులకు ఉచితంగా ఖురాన్ విద్య నేర్పించనున్నట్లు తెలిపారు. మసీదు నిర్మాణానికి సహకరించిన వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మసీదు వైస్ ప్రెసిడెంట్ నాయబ్ రసూల్, నాయకులు, మత గురువులు పాల్గొన్నారు.



నూతన మసీద్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

తడిచెత్త, పొడి చెత్త వేరుచేయాలి



ప్రజలకు కరపత్రాలు పంచుతున్న అధికారులు

కంభం: ప్రజలు ఇళ్లలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో ఉంచి పంచాయతీ రిక్షాల్లో వేయాలని ఈఓపీఆర్డీ విజయలక్ష్మి సూచించారు. స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పంచాయతీ అధికారులు ప్రజలు, వ్యాపారులకు కరపత్రాలు పంచుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో, వీధుల్లో చెత్త వేస్తే ఏపీ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. భూమిలో కలిసి కుళ్లిపోయే పదార్థాలన్నీ తడి చెత్త కిందకు వస్తాయని, భూమిలో కలిసిపోని పదార్థాలన్నీ పొడి చెత్త కిందకు వస్తాయని, దాన్ని బట్టి ప్రజలు ఇంట్లోనే చెత్తను వేరు చేసి రిక్షాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై దృష్టి పెట్టండి

మార్కాపురం టౌన్:

గడచిన ఏడాది కాలంగా జిల్లా ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించక వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఓపీ మల్లిక్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పౌరసరఫరాల శాఖ పనితీరు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, రేషన్ కార్డుదారుల నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలపై గతంలో ప్రజా సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేవారమని, ఏడాదిన్నర కాలంగా సమావేశాలు నిర్వహించకపోవడంతో ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదన్నారు.

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విజిలెన్స్ సలహా సంఘం సమావేశం నిర్వహించాలని, ధరల నియంత్రణ కమిటీ సమావేశం కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకుని కమిటీ సమావేశాలను త్వరగా ఏర్పాటు చేసి వినియోగదారులకు మేలు జరిగేలా చూడాలని కోరారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి




సంత్ గాడ్గే బాబాకు నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: నిరుపేద కుటుంబంలో జన్మించి కుల నిర్మూలన, అంటరానితనం నిర్మూలన కోసం పోరాడటంతోపాటు ఆధ్యాత్మిక చైతన్యం కోసం పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా అని రజక విద్యా సంక్షేమ సంఘ అధ్యక్షుడు దేవలూటి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఆదివారం సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాక ముందే విద్యకోసం 154 పాఠశాలలు, మహారాష్ట్రలో యూనివర్శిటీని గాడ్గే బాబా ప్రారంభించి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అప్పట్లోనే స్వచ్ఛభారత్‌ను ఆచరించిన మహనీయుడని కొనియాడారు. స్వచ్ఛభారత్ పితామహుడిగా సంత్ గాడ్గే బాబాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన గురువుగా సంత్ గాడ్గే బాబాను ప్రకటించుకున్నారని, ఫిబ్రవరి 23ను సఫాయి కర్మచారీ దివస్‌గా ప్రకటించాలని రజక సంఘ నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. ఈ సందర్భంగా పేద, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివయ్య, ఆర్.కాశయ్య, చిరంజీవి, లక్ష్మీనారాయణ, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కాశయ్య, కాశీరావు, చెరుకుపల్లి శివయ్య, ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ సంఘ చైర్మన్ రంగనాయకులు, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ గాలెం కాశయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్‌ను తరలించవద్దు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తరలించవద్దని కోరుతూ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ముస్లిం మైనార్టీ నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలను తరలిస్తే ముస్లిం విద్యార్థులు ఉర్దూ అభ్యాసానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సాధిక్, గఫార్, ఖాన్, హుస్సేన్‌బేగ్, బషీరా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నాయుడుపేట వెళ్లే మార్గంలో..





గొట్లగట్టు బస్టాండ్‌లో..

మంచోదయం!

కొనకనమిట్ల: పగలు ఎండ దంచికొడుతోంది కానీ వేకువజామున మాత్రం మంచు వీడటం లేదు. ఉదయం 8 గంటల వరకు దట్టంగా మంచు కురుస్తోంది. బడి పిల్లలు, కూలీలు, వాకర్స్ హిమపాతాన్ని ఆస్వాదించగా వాహనదారులు మాత్రం నెమ్మదిగా ముందుకు సాగారు. మంచు తెమ్మెరలను తప్పిస్తూ భానుడు ఉదయిస్తున్న దృశ్యం అందరినీ ఆకర్షించింది. ఈ దృశ్యాలను కొనకనమిట్ల మండలం గొట్లగట్టు సమీపంలో 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

మైలురాయిని ఢీకొని కారు బోల్తా

కంభం: మైలురాయిని ఢీకొట్టి కారు బోల్తాపడటంతో ఇద్దరికి తీవ్ర, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం అనంతపురం–అమరావతి హైవేపై కంభం–జంగంగుంట్ల మధ్యలో చోటుచేసుకుంది. వివరాలు.. బేస్తవారిపేట నుంచి మార్కాపురం వెళ్తున్న ఓ కారు కంభం–జంగంగుంట్ల మధ్యలో నల్లవాగు సమీపంలో హైవే పక్కన ఉన్న మైలురాయిని బలంగా ఢీకొని బోల్తా పడటంతో నుజ్జునుజ్జయింది. కారులో ఐదుగురు ఉండగా కాశిరెడ్డి, డ్రైవింగ్ చేస్తున్న చందుకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. కాశిరెడ్డిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా చందును పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని కంభం ఎస్సై నరసింహారావు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.



సంఘటనా స్థలంలో నుజ్జయిన కారు